# గాడిద

మనిషి ఎలాంటివాడైనా, పనిలో మాత్రం ఎవరూ జోగారావును వేలెత్తి చూపించటానికి వీల్లేదు. ఆఫీసు రూల్సూ, మాన్యువల్సూ కంఠస్థం. పై అధికార్ల మనసు తెలుసుకుని కేసులను ఎలా అంటే అలా మలిచి దేనికైనాసరే రూల్సు, రెగ్యులేషన్సు చూపిస్తూ 'పుటప్' చెయ్యగలడు. తన ఒక్క సెక్షను అనేకాదు, మొత్తం ఆఫీసులో ఏఏ ఫైల్సు, ఏఏ రాక్సులో వున్నాయో కూడా చెప్పగలడు. పాతికేళ్ల సర్వీసుంది మరి. ఎప్పుడే రూలుకు ఏ అమెండు వచ్చిందో కూడా జ్ఞాపకమే. కొత్తవాళ్లకైతే అన్నీ వెదికి, చదివి, అర్థం చేసుకోవటానికి వారం పదిరోజులన్నా పడుతుంది. జోగారావుకు ఓ సిగరెట్టు దమ్ము లాగేలోగా అన్నీ అరటిపండు వొలిచినట్టు చెప్పెయ్యగలడు. ఇంతకూ జోగారావు ఎలాంటివాడో అంటే ఎలాంటి వాడూ కాదు. మనిషి బాగా మెతక.

"వీళ్ల తరం అంతరిస్తోంది. ఇప్పుడిలా పనిచేసేవాళ్లేరీ? ఆ డెడికేషన్, ఆ అణకువ, ఆ వినయం ఇప్పటి కుర్రాళ్లలో ఆశించటానికే వీల్లేదు" అంటాడు పై అధికారి జోగారావును మెచ్చుకోవాల్సి వచ్చినప్పుడు.

కళ్లద్దాలు సవరించుకుంటూ, పైకిపోతున్న పాతచొక్కాను కిందికి లాక్కుంటూ జోగారావు నల్లబడి, వాడిన పెదాలు తెరిచి, గారపట్టిన పళ్లు కనిపించేలా మర్యాదగా చిరునవ్వు ప్రదర్శిస్తూ-

"ఈ ఆఫీసు ఉప్పుతిన్నందుకు శక్తివంచన లేకుండా సేవ చేశాననే తృప్తి నాకుంది సార్. అంతేచాలు" అంటాడు.

"గుడ్. గుడ్. కీపిటప్" అంటాడు అధికారి జోగారావు వినయాన్ని భరించలేక, యింకవెళ్లొచ్చని ఎదుటవున్న కాగితాల్లోకి విసుగ్గా చూస్తూ.

ఆఫీసర్ల మంచిమాటలే యింక్రిమెంట్లూ, ప్రమోషన్లూ అన్నంత సంబరపడిపోయి జోగారావు రోజూ ఆఫీసుకు గంట ముందుగా వచ్చి, రెండు గంటలు ఆలస్యంగా పోతాడు.

ప్రైవేటు సంస్థల్లో అయితే లాభం, నష్టం నికరంగా కనిపిస్తుంది. పెట్టుబడిదారుకూ, షేర్‌హోల్డర్లకూ 'రిజల్ట్సు' కావాలి. ఆఫీసు సిబ్బంది, ఫ్యాక్టరీ ఖర్చులు, కూలీలు, జీతాలు, ఖర్చులు అన్నీ పోను "ఎంత మిగిలింది?" అన్న ధ్యేయం కోసం పనిచేస్తారు. కాని గవర్నమెంటాఫీసులు అలాకాదు. ప్రజాహిత కార్యక్రమాలకూ, ప్రభుత్వ ప్రణాళికలు అమలుపర్చటానికే అన్ని డిపార్టుమెంటులూ వున్నప్పటికీ, కొందరికి బల్ల కింది డబ్బులు అదనంగా రాగా, మిగతావాళ్లకు నెలసరి జీతాలు తప్ప వొరిగేదేమీ వుండదు. కిందినించి పైదాకా అందరూ అంతే. అందువల్ల పేబిల్సు తయారుచేసుకోవటమూ, టిఎ/ మెడికల్ బిల్సు క్లయిమ్ చేసుకోవటంలో చూపిన శ్రద్ధ రొటీన్ పనిచెయ్యటానికి వుండదు. ఎప్పుడు ఏ పని జరక్కపోయినా, అవే రూల్సును వుటంకిస్తూ మాంఛి ఎక్స్‌ప్లనేషన్ ఒకటి యివ్వగలిగితే చాలు. అందరూ తృప్తిపడతారు.

"మా సెక్షన్ ప్యూన్ గండయ్య యివాళ కూడా మూడింటికే వెళ్లిపోయాడు సార్" అన్నాడు జోగారావు.

ఫోనులో మాట్లాడుతున్న అధికారి విసుగ్గా చూశాడు. తన తొందరపాటుకు సిగ్గుపడి జోగారావు, ఫోను సంభాషణ ముగిసిందాకా ఆగి మళ్లీ విన్నవించుకున్నాడు.

## ముక్తవరం పార్థసారథి

"అయితే ఏం చెయ్యమంటావ్?' జోగారావు వులిక్కిపడ్డాడు.

"అదికాదు సార్. సెక్షనుకు వచ్చిన ఈ నెల్లాళ్లనుంచీ వాడు- అతడు రోజూ యిలాగే చేస్తున్నాడు. సాయంత్రం ఈ ఫైళ్లన్నీ అల్మైరాల్లో పెట్టటానికెవరూ వుండరు" అంటూ భయపడుతూనే కక్కాల్సింది కాస్తా కక్కేశాడు.

అధికారి నిట్టూర్చాడు. "అవున్నయ్యా, వాడు ఏ సెక్షనులో వున్నా అంతే. ఓ కిరాణాకొట్టూ, రెండు పాన్‌షాపులూ వున్నాయి. మనం వుండమంటే వుంటాడా. వాడికీ ఆఫీసుద్యోగం ఓ లెఖ్ఖనా ఏమిటి."

నవ్వాలో, ఆఫీసరుతో సానుభూతి చూపించాలని, కోపగించుకోవాలో తెలియక తలొంచుకున్నాడు జోగారావు.

"ఎలాగో సర్దుకుపోవాలి మరి. ఇప్పటికి రెండుసార్లు పిలిచి వార్నింగిచ్చాను. మెమో కూడా ఇచ్చాను. ఏమన్నా వులకడు పలకడు. "గరీబోణ్ణి పిల్లలు గలోణ్ణి. నేనిక్కడ పొద్దుమీకిందాక కూసుంటె దుకాణం ఎవరు సూస్తర్సార్" అంటాడు గండయ్య. ఉదయం పదకొండింటి దాకా రాడు. రాగానే చాయకు పోతాడు. ఆ తర్వాత లంచ్ అవర్. సాయంత్రం మూడైందంటే, ఆరునూరైనా సరే వెళ్లిపోవాల్సిందే.


ఆఫీసరుకు మెమో యివ్వగలిగిన అధికారమే వుంది. అంతకన్న కఠినమైన చర్య తీసుకోలేడు. ఛార్జిషీటివ్వాలన్నా, సస్పెండు చెయ్యాలన్నా పై అధికార్లకు పోవాలి కేసు. గండయ్య ఎంత చెడ్డవాడైనా చూస్తూ అతడిమీద నోటు రాయాలంటే ఎవరికీ చేతుల్రావు. లేదా ధైర్యం చాలదు. ఉద్యోగం ఖాతరు చెయ్యనివాడిమీద 'యాక్షన్' తీసుకుంటే తమకే నామోషీ. తలవంపులు.

జుట్టు పీక్కుంటూ బైటికొచ్చాడు సెక్షనాఫీసరు జోగారావు.

"ఏమైంది సార్, ఈ ఫైల్సు లోపల ఎవడు పెట్టాలె?" అన్నాడు చంద్రశేఖర్ సిగరెట్ వెలిగించి, ఎదురుగావున్న ఆడ క్లర్కు ఆనందంకోసం రింగులురింగులుగా పొగ వదులుతూ.

"నేనున్నాను గదయ్యా బాబూ, హెడ్డు ప్యూనును" అన్నాడు జోగారావు.

ఆడక్లర్కు చిరునవ్వు ఆపుకుంది. చంద్రశేఖర్ ఆపుకోలేకపోయాడు.



“ఎప్పట్నించిసార్. మీకు ప్రమోషన్ వచ్చిన విషయమే మాకు తెలియదు.”

జోగారావు కోపం దిగమింగుకుంటూ–

“నవ్వండయ్యా నవ్వండి. ఇవి మీ రోజులు” అన్నాడు. చంద్రశేఖరం తండ్రి మరో డిపార్టుమెంటులో అసిస్టెంట్ సెక్రటరీ. ఆ తండ్రన్నా ఎప్పుడైనా తన హోదా మరచిపోతాడేమోగాని, ఈ సుపుత్రుడు మాత్రం భేషజంగా, ఈ చిన్న చిన్న ఆఫీసర్లను తన సబార్డినేట్స్‌లాగ ట్రీట్ చేస్తాడు. చంద్రశేఖరం చిలిపి పనులు ఎవరికి మొరపెట్టుకోగలడు!

“మీ రిజల్ట్సు ఎప్పుడు వస్తాయండీ?’ అంది ఆడక్లర్కు.

“వారం రోజుల్లో”. చంద్రశేఖర్ గ్రూప్‌వన్ పరీక్ష, యుపీఎస్సీ, బ్యాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్ల టెస్ట్, ఐఎఎస్ అన్నీ రాసేశాడు. వాళ్లు దేని గురించి మాట్లాడుకుంటున్నారో జోగారావుకు అర్థంకాలేదు.

“ఇది వట్టి బాడకావు నౌకరీ. నేనిక్కడ సంవత్సరం దాటి వుండేదిలేదు దట్స్ షూర్.”

“మా ఆయనకూ్కడా బొంబాయి ట్రాన్స్‌ఫర్ అయింది. నేనూ రిజైన్ చేస్తాను” అంది ముద్దుగా ఆడక్లర్కు.

ఆమె భర్త ఓ ఫార్మసూటికల్ కంపెనీలో ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ కారులో వస్తుంది. పెద్దాఫీసర్లకు మందుల సాంపుల్స్, మల్టీవిటమిన్ కాప్స్యూల్స్, టానిక్కులూ తెచ్చిస్తుంది.”

“మన రామలింగం కూడా వెళ్లిపోయాడా?” అంటూ గొణిగాడు జోగారావు.

“వాడెక్కడికి పోతాడు సార్. పక్క సెక్షన్‌లో కలెక్షన్లకోసం తిరుగుతుంటాడు. కొత్త కటపీసెస్ తెచ్చాడు చూశారా? అన్నట్టు గురువుగారూ వాళ్ల బ్రదర్ మొన్న గల్ఫ్ నించి వస్తూ తెచ్చాడట. ఓ అరడజను ఎలక్ట్రానిక్ వాచెస్, యాషికా కెమెరా, సోనీ త్రీయిన్‌వన్”అన్నాడు చంద్రశేఖర్.

“నాకేం తెలుస్తాయి అవన్నీ.”

“కొన్న ధరకే యిస్తాడట. మీకు కనీసం ఓ వాచీ అయినా యివ్వకపోతాడా! అడగండి.”

“అహా. అందుకోసం కాదు. ఇవాళ వుదయం రెండు కేసులు పుటప్ చేస్తానన్నాడు. చేశాడేమోనని.

“ఆఫీసు పనికోసం వాణ్ణి నమ్ముకుంటే మీరు మునిగినట్టే. వాడికి ఎక్స్‌ట్రాకాలిక్యులర్ యాక్టివిటీస్ ఎక్కువ. మీరు వాణ్ణలా బాధపెట్టొదు.”

జోగారావు ఏడవలేక నవ్వాడు. ఏదో రిపార్టీ నాలికదాకా వచ్చిందిగాని, కీడెంచి మేలెంచమన్న సామెత గుర్తొచ్చి ఆ ప్రయత్నం మానుకున్నాడు.

నాలుగున్నరైంది. సెక్షను యించుమించు

> **ప్రజాహిత కార్యక్రమాలకూ, ప్రభుత్వ ప్రణాళికలు అమలుపర్చటానికే అన్ని డిపార్టుమెంటులూ వున్నప్పటికీ, కొందరికి బల్ల కింది డబ్బులు అదనంగా రాగా, మిగతావాళ్లకు నెలసరి జీతాలు తప్ప వొరిగేదేమీ వుండదు. కిందినించి పైదాకా అందరూ అంతే. అందువల్ల పేబిల్సు తయారు చేసుకోవటమూ, టిఎ/మెడికల్ బిల్సు క్లయిమ్ చేసుకోవటంలో చూపిన శ్రద్ధ రొటీన్ పనిచెయ్యటానికి వుండదు.**

ఖాళీ అయింది. ఎవరికైనా పనిచెప్పటం వృథా అనే అనుభవజ్ఞానమున్నవాడు గనక జోగారావు నెమ్మదిగా లేచి తన సెక్షనులోని గుమాస్తా సీట్లన్నింటికీ వెళ్లి, అర్జెంట్ ఫైల్స్ తీసుకుని తన టేబుల్ మీద పెట్టుకుని, మిగతా ఫైళ్లు అల్మైరాల్లో పెట్టి, తాళాలు వేసి వచ్చి, ఆ కేసులన్నీ ఆప్యాయంగా చదివి డీల్ చెయ్యటానికూ్కర్చున్నాడో లేదో లోపల్నించి బాస్ కాలింగ్ బెల్ వినిపించింది.

కాగితాల మీద పేపర్ వెయిట్ పెట్టి, కలం అలాగే పట్టుకుని పరుగెత్తాడు జోగారావు.

“మొన్న కమిషనర్ దగ్గిర్నుంచి లెటరొచ్చింది. పుటప్ చేశావా?”

“లేదండీ. ఆ సీటు క్లర్కు...”

“క్లర్కుల సంగతి నాకు చెప్పకయ్యాబాబూ. మనం చెబితే వింటారా వాళ్లు. డూ యిట్ యువర్ సెల్ఫ్. అవునూ, స్టేట్‌మెంట్స్ పంపించడానికి రేపే లాస్ట్ డేట్ అనుకుంటాను.”

“అవునండీ. కాని...”

“కానీ లేదు అణాలేదు. రేపు సాయంత్రం వరకు అవి డిస్పాచ్ కావల్సిందే. ఏం విన్పించిందా.”

“అలాగేనండీ”

“ఇదిగో జోగారావు. ఇలా అన్నింటికీ గొర్రెలాగ తలూపితే లాభంలేదు. పనిచెయ్యాలి. రోజూ రెండు గంటలు ఆలస్యంగా ఎందుకూ కూర్చోవటం– వాట్సది యూజ్... ఈమాత్రం పనిచెయ్యలేకపోతే”

“చేస్తాను సార్. కాని యితర్లు కూడా సాయం చేస్తే...”

“ఎవ్వరూ చెయ్యరయ్యా. వాళ్ళకుద్యోగాలంటే లెక్కలేదు. ఇదికాకపోతే మరోటి చూసుకుంటారు. వాళ్లమీద అజ్మాయిషీ... నడవవు. చేస్తే నువ్వు చెయ్యాలి. లేదా నీకూ విసుగొచ్చిందా, డిపార్టుమెంటు ట్రాన్స్‌ఫర్ చేయించుకో. లేదా రిజైన్ చెయ్యి. అంతేతప్ప ఇతర్ల గురించి కంప్లేయిన్ చెయ్యకు.

“అదికాద్సార్.”

“సర్లే. ఇంక నీసోది కట్టిపెట్టి కాస్త పనిచెయ్యి. ఇదిగో, ఆరున్నరకు మా మామగారు కలకత్తా నుంచి ఫ్లైట్‌లో వస్తున్నారు. నేను, మా ఆవిడ వెళ్లాలి రిసీవ్ చేసుకోవటానికి. రేపు మాట్లాడదాం” అంటూ ఆఫీసరు కారులో తుర్రుమన్నాడు.

జోగారావు ఆఫీసర్ రూంకు కూడా తాళం వేసి వచ్చి సీట్లో కూలబడ్డాడు.

అందరూ వెళ్ళిపోతే ఆఫీసు ఖాళీగా, బోసిగా వుంది. క్షణంలో ఆ హాలు ఓ క్లబ్బుగా మారింది. రకరకాల వాయిద్యాలతో ఆర్కెస్ట్రా మోగుతున్నది. ఆటలు... పాటలు... నాట్యాలు. పొగలుకక్కే అనేకరకాల భోజన పదార్థాలు టేబుళ్లమీద పరచారు. పెద్ద బఫే. తిన్నవాడికి తిన్నంత. సిగ్గుపడకుండా కావలసింది తీసుకొని తిను. ఆఫీసర్ కేబిన్‌లో ప్లేను దిగుతున్న చప్పుడైంది. అందరికీ నమస్కారం చేస్తూ చిరునవ్వు నవ్విన ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగంతప్ప గతిలేని జోగారావుని చూసి మూతివిరిచింది.

